పనితీరు మార్చుకోవాలి

ఆమదాలవలస : మున్సిపాల్టీలో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పనితీరు మారాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 31వ తేదీ నాటికి గృహ నిర్మాణ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని పలుమార్లు చెప్పినా, నత్తనడకన సర్వే నిర్వహించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 17.30 లక్షల ఇళ్లు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, వార్డు సచివాలయ ఉద్యోగులు ఈనెల 31వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో పలు విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పక్కాగా నివేదికల రూపొందించాలన్నారు.సమావేశంలో పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు బోర గోవిందరావు, మురళీధరరావు, గురయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసికి 'పండగ'

- కలిసొచ్చిన సంక్రాంతి సీజన్
- ప్రత్యేక బస్సుల ద్వారా రూ.1.05 కోట్ల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే అదనంగా రూ.9.74 లక్షల రాబడి
- సాధారణ ఛార్జీల కారణంగా ఆర్‌టిసి వైపు ప్రజలు మొగ్గు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చాలా కాలం తర్వాత ఆర్‌టిసి గల్లా పెట్టె కాసులతో గలగలలాడింది. నష్టాల్లో ఉన్న ఆర్‌టిసికి సంక్రాంతి కలిసొచ్చింది. పండగ రద్దీ నేపథ్యంలో బస్సులు, అదనపు ట్రిప్పులు, ఆయా రూట్లలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణాధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చింది. పండగ రోజుల్లో నడిపిన ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలు వసూలు చేయడం, ప్రయివేట్ ట్రావెల్స్‌ల్లో అధికంగా వసూలు చేయడం వంటి కారణాలతో ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణించేందుకు మొగ్గు చూపారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖ ప్రాంతాలకు వేసిన ప్రత్యేక బస్సులతో ఆర్‌టిసికి భారీ ఆదాయం సమకూరింది. ఒక్క విశాఖ రూట్‌లోనే 80 శాతానికి పైగా ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే అదనంగా రూ.10 లక్షల ఆదాయం సమకూరడం ప్రజా రవాణా శాఖకు కొంత ఉపశమనం కలిగినట్లయింది.

జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో సాధారణ రోజుల్లో 340 బస్సుల వరకు తిరుగుతున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రజా రవాణా అధికారులు ఈ ఏడాదీ అదనపు సర్వీసులు, ట్రిప్పులను నడిపారు. అందుబాటులో ఉన్న స్పేర్ బస్సులు, బడి బస్సులను వినియోగించారు. పలు కారణాలతో రిపేర్‌కు గురైన బస్సులను మరమ్మతులు చేపట్టి ఉపయోగించుకున్నారు. పండగ సీజన్‌లో మొత్తం 570 బస్సులను తిప్పారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే వారి కోసం ఈనెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడిపారు. తిరుగు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని పండగ తర్వాత 17 నుంచి 21వ తేదీ వరకు తిప్పారు. హైదరాబాద్‌కు ప్రత్యేకంగా 18 సూపర్ లగ్జరీ బస్సులను నడిపారు. విజయవాడ, రాజమండ్రి, విశాఖ, అమలాపురం ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు, అదనపు ట్రిప్పులు తిప్పారు. వీటితో పాటు జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, బత్తిలి, పాలకొండ, రాజాం, సాలూరు వంటి ప్రాంతాలకూ అదనపు సర్వీసులు, ట్రిప్పులు తిప్పారు.

రూ.1.05 కోట్ల ఆదాయం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో అదనంగా రూ.పది లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పండగకు మొత్తం 579 బస్సులను నడిపారు. వీటి ద్వారా రూ.1,04,51,000 ఆదాయం అదనంగా వచ్చింది. సంక్రాంతి సమయంలో 517 బస్సులను నడపగా, రూ.94.77 లక్షల ఆదాయం సమకూరింది. దీంతో గతేడాది కంటే ఈ ఏడాది రూ.9.74 లక్షల ఆదాయం అదనంగా వచ్చినట్లయింది.

పెరిగిన ఆక్యుపెన్సీ రేటు

పండగ సీజన్‌లో ఈ ఏడాది ఆక్యుపెన్సీ (ఒఆర్) స్వల్పంగా పెరిగింది. ఈ ఏడాది 71 శాతం ఒఆర్ రాగా, గతేడాది 70 శాతం వచ్చింది. జిల్లాలో ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో అన్ని బస్సులు కలిపి 2,61,788 కిలోమీటర్ల దూరం తిరిగాయి. ప్రయాణాల ద్వారా ఆర్‌టిసికి ఒక కిలోమీటరుకు రూ.40 ఆదాయం వచ్చింది.

విశాఖ రూట్‌లో అధిక శాతం ఆదాయం

సంక్రాంతి స్పెషల్ బస్సుల్లో అధిక శాతం బస్సులు విశాఖ మార్గంలో నడిపారు. దీంతో ఆ రూట్‌లో అధికంగా అదాయం లభించింది. మొత్తం రూ.49 లక్షల ఆదాయం వచ్చింది. హైదరాబాద్‌కు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.11.79 లక్షల ఆదాయం సమకూరింది. విజయవాడ రూట్‌లో రూ.12.31 లక్షలు, రాజమండ్రి మార్గంలో రూ.4.96 లక్షల ఆదాయం వచ్చింది. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, బత్తిలి, పాతపట్నం, పాలకొండ, రాజాం తదితర మార్గాల్లో రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరింది.

మాట్లాడుతున్న విజయగౌరి

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై నికరంగా, నిరంతరాయంగా చట్టసభల్లో పోరాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని రాగోలు, ఎస్.ఎస్ వలస, నవనంబాడు, సింగుపురం, పెద్దపాడు, పాత్రునివలస, ఒప్పంగి హైస్కూళ్లతో పాటు కెజిబివి, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూళ్లలో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అన్ని స్థాయిల్లో ఉద్యోగోన్నతులు అడ్‌హక్ పద్ధతిలో చానల్‌ను ఓపెన్ చేసేందుకు కషి చేస్తానని హామీనిచ్చారు. 117 జిఒ, సిపిఎస్ రద్దు తదితర దీర్ఘకాలిక అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. కెజిబివి, మోడల్ స్కూల్స్, జ్యోతిరావు పూలే పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై, మినిమం టైమ్ స్కేల్ సాధనకు కృషి చేస్తానని చెప్పారు. కాంట్రాక్టు లెక్చరర్లకు 114 జిఒ అమలుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. విద్యారంగంపై సమగ్ర అవగాహన ఉన్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ఆర్థికపరమైన బకాయిలు, 12వ పిఆర్‌సి అమలుకు భవిష్యత్‌లో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణ కోసం విజయగౌరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కుమార్, జిల్లా కౌన్సిలర్లు కె.వి.రమణ, ఉగాది తదితరులు పాల్గొన్నారు.

నేడు అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ హుండీలను ఈనెల 24వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఇఒ వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.

రహదారి భద్రతే జీవితానికి రక్షణ

- రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
- స్పీడ్ బ్రేకర్స్ సత్వరం ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డ్రైవింగ్ చేసే ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యాన 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలు, జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లాలో అనేక చోట్ల రోడ్డు భద్రతపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లలో రవాణాకు సంబంధించిన రహదారులు, సర్వీస్ రోడ్లు, స్పీడ్ బ్రేకర్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్స్ సత్వరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా చర్యలపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని సూచించారు. రోడ్డుపై మార్కింగ్, సైన్ బోర్డులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జాతీయ రహదారుల్లో సైన్ బోర్డులు పెద్ద అక్షరాలతో ఉండేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బి, మున్సిపాలిటీ సమస్యలు ఉన్న రహదారుల గుర్తించి వాటిపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమన్నారు. కారు డ్రైవింగ్ చేసే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని స్పష్టం చేశారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను వాహనంలో ఎక్కించుకుని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లకు సలహాలు ఇవ్వడంతో పాటు కంటి, ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ విజయసారథి, ఎఎస్‌పి కె.వెంకటరమణ, డిఎస్‌పి వివేకానంద, డిపిఒ భారతీ సౌజన్య, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, నేషనల్ హైవేస్ అథారిటీ పీడీ తివారీ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రూ.30 వేల కోట్లతో పవర్‌ప్లాంట్ నిర్మాణం

జెన్‌కో సిఇ సురేష్‌బాబు

ప్రజాశక్తి - బూర్జ, సరుబుజ్జిలి

రూ.30 వేల కోట్లతో 3,200 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే పవర్ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు జెన్‌కో చీఫ్ ఇంజినీర్ జి.సురేష్ బాబు వెల్లడించారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో పవర్ ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను జెన్‌కో చీఫ్ ఇంజినీర్ల బృందం గురువారం పరిశీలించింది. ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి సిఇ వై.సురేష్‌బాబు, ఎస్ఇలు జి.రామకృష్ణ నాయుడు, డి.కృష్ణారావు, ఇఇలు జి.వాసుదేవరావు, బి.చలపతిరావు సరుబుజ్జిలి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష ఆధ్వర్యాన పవర్ ప్లాంట్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ సుమారు 15వేల మందికి ఉపాధి కల్పించే ఈ పవర్ ప్లాంట్ మొదటి దశ రూ.15 వేల కోట్లతో 1600 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండో దశలో మరో రూ.15 వేల కోట్లతో 1600 మెగావాట్లతో పూర్తి చేస్తామన్నారు. ఈ రెండు దశలనూ మూడేళ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస, లక్ష్మీపురం, శ్రీరాంవలస, బూర్జ మండలం మదనాపురం, బొడ్లపాడు, అడ్డూరిపేట, జె.వి పురం, సోమిదివలస, గోపీదేవిపేటకు చెందిన సుమారు 600 ఎకరాల భూములు పవర్ ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉన్నాయని ఎమ్మెల్యే రవికుమార్ జెన్‌కో బృందానికి వివరించారు. వంశధార జలాశయం నుంచి వంశధార, నాగావళి నదుల అనుసంధాన హెచ్‌ఎల్‌సి కాలువతో నీటి అనుకూలత ఉంటుందని వివరించారు. వెన్నెలవలస మినీ జలాశయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు.

పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టే ప్రదేశానికి మూడు, నాలుగు గ్రామాలు తక్కువ కుటుంబాలున్న ప్రాంతాలే పరిగణనలోకి వస్తాయని, మిగిలిన గ్రామాలన్నీ దూర ప్రాంతంలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, తహశీల్దార్లు ఈశ్వరమ్మ, మధుసూదన్, టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, ఎ.రాంబాబు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెన్‌కో బృందానికి వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

కవిటి సర్పంచ్‌కు అరుదైన అవకాశం

ప్రజాశక్తి - కవిటి

లక్ష్మణరావు, సర్పంచ్

మేజర్ పంచాయతీ కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావుకు అరుదైన అవకాశం లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే వేడుకలకు ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈమేరకు కమిషనర్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి గురువారం ఆయనకు సమాచారం అందింది. కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు, ఉపాధి హామీ సద్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ - తాగునీటి కల్పన తదితర అంశాల ప్రాతిపదికగా సర్పంచ్‌ల ఎంపిక జరుగుతుంది. అందులోనూ జిల్లాకు ఒక్క సర్పంచ్‌కు మాత్రమే లభించే ఈ అవకాశం ఈసారి కవిటి సర్పంచ్ లక్ష్మణరావుకు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధానిలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం తనకు లభించడం గర్వంగా, సంతోషంగా ఉందన్నారు.

బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రసాదరావు కూడా...

ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్ : ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకులు మేడూరు ప్రసాదరావుకు ఆహ్వానం అందింది. గతేడాది నవంబరులో ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో బెజ్జిపురం యూత్ క్లబ్ 43 ఏళ్లుగా మహిళా స్వయం ఉపాధి సాధికారిత కోసం చేస్తున్న కృషిని ప్రశంసించారు. వేడుకల్లో పాల్గొనేందుకు ఆలిండియా రేడియో తరుపున ఈ ఆహ్వానం అందినట్లు ప్రసాదరావు తెలిపారు.

లేఅవుట్ల ప్లాట్ల కేటాయింపులో గందరగోళం

- సుడా అధికారుల తీరుపై ఎమ్మెల్యే శిరీష అసంతృప్తి
- డ్రా పక్రియ వాయిదా : జెసి

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 150 ఎకరాల్లో వేసిన ఎంఐజి లేఅవుట్‌లో ఫేజ్-1లో ప్లాట్ల పంపిణీకి లేఅవుట్ ప్రాంతంలో గురువారం నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈ ప్రక్రియలో లబ్ధిదారుల పేర్లు చెప్పకుండా దరఖాస్తు నంబరు చెప్పే విధానం సరిగా లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులను లబ్ధిదారులు నిలదీశారు. ఫేజ్-1లోని 50 ఎకరాల్లో ముందుగా 250 ప్లాట్లుకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించి వీటి విధి విధానాలను అధికారులు లబ్ధిదారులకు తెలిపారు. ప్లాట్లు కన్నా ఎక్కువ దరఖాస్తులు కొన్ని విభాగాలకు, మరికొన్ని విభాగాలకు తక్కువ ధరఖాస్తులు రావడంతో ఆన్‌లైన్ విధానంలో లక్కీ డ్రా తీస్తామని అధికారులు చెప్పడంతో ప్రారంభంలోనే లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్న ప్లాట్లకు తగ్గ దరఖాస్తులు తీసుకొని వాటిలో డ్రా తీయల్సి ఉండగా ఎక్కువ దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. మూడు రకాల ప్లాట్లు పలు లబ్ధిదారుల కేటాయింపులో ప్రతి అంశం వివాదస్పదంగా మారడంపై అసంతృప్తి చెందారు. అంతేకాకుండా సుడా అధికారులు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. స్క్రీన్‌పై లబ్ధిదారుల పేర్లు, ప్లాట్ల నంబర్లు కనిపించకపోవడంతో అధికారులు మైక్‌లో చెప్తూ లబ్ధిదారుల పేర్లు చెప్పకపోవడం మరింత గందరగోళంగా మారింది. 242 చదరపు అడుగుల స్థలాలకు ఎక్కువ మంది దరఖాస్తులు రాగా, వారికి ప్లాట్లు రాలేదు. ప్లాట్లు రాని వారికి తిరిగి డబ్బులు చెల్లిస్తామని అధికారులు ప్రకటించడంపై లబ్ధిదారులు మండిపడ్డారు. కొన్ని పేర్లు కంప్యూటర్‌లో నమోదు చేయడంలో తప్పులు దొర్లాయని తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఉద్యోగులకు కేటాయించిన పది శాతం రిజర్వేషన్‌పైనా ఉద్యోగులు సభావేదిక ముందుకు వచ్చి ప్రక్రియ సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

డ్రాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

డ్రా పక్రియ వాయిదా : జెసి

ఎంఐజి లేఅవుట్ స్థలాల పంపిణీ డ్రా ప్రక్రియలో తప్పిదాలు ఉన్నాయని గుర్తించడంతో ఈ ప్రక్రియను రద్దు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మరోమారు పూర్తిస్థాయిలో అన్ని అంశాలపై సుడా అధికారులకు అవగాహన కల్పించి ఈ పక్రియ నిర్వహిస్తామన్నారు. ఫేజ్-1లో స్థలం రాని వారికి ఫేజ్-2లో స్థలం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సుడా అధికారులపై తీరుపై అసంతృప్తి

సుడా అధికారుల తీరుపై ఎమ్మెల్యే గౌతు శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన ఆరు నెలల్లోనే శరవేగంగా పనులు చేపడుతూ మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటి స్థలాన్ని అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్లాట్ల డ్రా పక్రియ సుడా అధికారుల అవగాహన లేమితో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారుల పనితీరు కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని, త్వరలోనే లబ్ధిదారులందరికీ ప్లాట్లు అందిస్తామన్నారు. సుడా అధికారుల తీరుపై సుడా చైర్మన్ కొరికాన రవి అసంతృప్తి వ్యక్తం చేసి, మరోమారు ఇలా జరగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ ఇఇ సుగుణాకరరావు, ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, టిడిపి నాయకులు పి.విఠల్, ఎల్.కామేశ్వరరావు, నవీన్, జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - పలాస

సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్

పర్యావరణాన్ని పరిరక్షించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. కాశీబుగ్గ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జెవివి జిల్లా కార్యదర్శి ఎల్.వి చలం అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగశాల వినూత్న పోటీలు, పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, ఆ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణంపై పలాసలో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో జెవివి జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు బల్ల చిట్టిబాబు, జి.కోదండరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పాలవలస ధర్మారావు, ఆర్.సురేష్‌బాబు, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.జయరాం సిద్ధేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణతో నష్టం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా దేశంలో ఎక్కడా లేని విధంగా వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ అన్నారు. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణను నిలుపుదల చేయాలన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వర్గీకరణ చేపట్టడంపై ఆసక్తి చూపడం వల్లే రాష్ట్ర విభజన ఉద్యమానికి ఊతమిచ్చిందన్నారు. దేశంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు.

రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, ఇటువంటి తరుణంలో హడ్కో నుంచి రుణం తెచ్చే కంటే బడ్జెట్‌లో విభజన వాటాలు అడగాలన్నారు. దావోస్ వెళ్లినా ఒప్పందాల వల్ల ఒరిగిందేమీ ఉండదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ప్యాకేజీ వల్ల ప్రయోజనం ఉండదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షణ్ముఖరావు, అక్కినేని నారాయణరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజినీర్లు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రహదారి భద్రతపై వాహనదారులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఇ ఎం.శ్రీనివాస్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పరిషత్ నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ అతివేగంగా ప్రయాణం నష్టదాయకమన్నారు. సిగ్నల్ వ్యవస్థపై అవగహన లేకపోవడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల నష్ట దాయకమన్నారు. కార్యక్రమంలో ఇఇ ఎస్.రామకృష్ణ, డిప్లమో ఇంజినీర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిహెచ్ మహంతి, డిఇఇలు కెకె విశ్వనాథ్, కెఎస్ చలపతి, నాగేశ్వరరావు, ఎఇలు పి.శంకరరావు, కె.అంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట పంచాయతీ పరిధిలోని ఎల్ఎపిఎం అగ్రహారం వద్ద గురువారం ఎమ్మెల్యే కూన రవికుమార్ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, గోవిందరావు మండల టిడిపి నాయకులతో కలిసి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట మండలాలను కలుపుతూ ఉన్న అగ్రహారం, దబ్బపాడు బిటి రహదారి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం జెసిబిని ఎమ్మెల్యే నడుపుతూ రహదారి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు అంబల్ల రాంబాబు, వెలమల రమేష్, చిన్నాల అప్పారావు, నూక కోటి, ప్రభాకర్, పేడాడ మణి, రమణ, పూర్ణారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి రవికుమార్

కార్యకర్తలకు అండగా ఉంటాం

బూర్జ: వైసిపి కోసం అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేసిన కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటామని వైసిపి అమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని మదనాపురంలో వైసిపి మండల అధ్యక్షులు కండాపు గోవిందరావు నివాసంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు మొక్కవోని దీక్షతో నిలబడాలన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగవద్దన్నారు. ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నూతన విధానాలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతిఒక్క కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు వ్యక్తిగత కక్షలతో అధికార పార్టీ అన్యాయానికి పాల్పడితే ఊరుకోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నెన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

పోలాకి: మండలంలోని ఈదులవలస ఎపి మోడల్, కళాశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకు పనులు ఇటీవల చేపట్టారు. ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్ బృందం పనులకు సంబంధించిన దీనిపై ఎస్ఆర్‌పి పి.రామారావు గురువార రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, డిఆర్‌పిలు సత్తిబాబు, రాజు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రామారావు

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పలాస : కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

బూర్జ : కేకును కట్ చేస్తున్న రామకృష్ణనాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారున ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ముందుగా కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతూ లోకేష్ విద్యా శాఖలో పెను మార్పులను తీసుకువచ్చారని కొనియాడారు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, టిడిపి నాయకులు సనపల డిల్లేశ్వరరావు, సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్, యువగళం టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఏడురోడ్ల కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు పేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు ముందు స్వర్గీయ ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడుల విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదారపు వెంకటేష్, గొండు వెంకటరమణ, జామి భీమశంకరరావు, నాగభూషణం, నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్ ఆవరణలో...

లోకేష్ జన్మదిన వేడుకలను రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో శివప్రియ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన వీల్‌చైర్స్, స్ట్రెక్చర్స్‌ను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ రెడ్డి శివన్నారాయణ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో సర్వజనాసుపత్రి సూపరింటిండెంట్ డా.షకీల, డాక్టర్ సుభాషిని, డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ఆధ్వర్యంలో విజయనగరంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన కార్యక్రమంలో లావేరు గ్రామానికి చెందిన యువత 30 మందికిపైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువతను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అప్పలనాయుడులు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, జగ్గన్నదొర, రాంబాబు, భాస్కరరావు, అనీల్‌కుమార్, యువకులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : లోకేష్ జన్మదినం సందర్భంగా నడుకుదిటిపాలెంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కేకు కట్ చేశారు. అనంతరం సిఎం సహాయనిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, లెంక శ్యాం, పిసిని జగన్నాథం నాయుడు, గొర్లె లక్ష్మణరావు, ముప్పిడి సురేష్ కుమార్, సంధ్యారాణి, బెండి మల్లేసు, రవికుమార్, బి.వెంకటేశ్వరరావు, తోటయ్యదొర, పిన్నింటి మధుబాబు, రౌతు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ప్రకాశరావు, లెంక ప్రభ, నారాయణరావు, గాలి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని మదనాపురంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో గురువారం లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ నాయుడు కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పార్టీ శ్రేణులతో కలిసి కవిటి చింతామణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, ఆరంగి మధు, బెందాళం తిరుమలరావు, ప్రగడ మణిబాబు, తెప్పల మోహనరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

కొత్తూరు : విద్యాశాఖ మంత్రి లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు తన నివాసంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, కొయిలపు సంజీవరావు, డి.రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే నవగాం రోడ్డులోని టిడిపి నాయకులు మాతల గాంధీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అగతముడి అరుణ్‌కుమార్, మాధవరావు, పాత్రుకొండ మోహనరావు, ఎం.కృష్ణ, లోకేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, చాపర మాధవరావు, అగ్గాల శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక టిడిపి కార్యాలయంలో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.మహేష్, సింహాద్రినాయుడు, కె.విశ్వనాథ్, రవిబాబు, కొన్ని జయరాం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక టిడిపి కార్యాలయంలో పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వర రావు, తర్ర రామకృష్ణ, నంబాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలాస : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష కేక్ కట్ చేశారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, డొక్కరి శంకర్ కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక టిడిపి కార్యాలయంలో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా మండల అధ్యక్షులు బగాది శేషగిరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మట్ట సుందరమ్మ, మెండ దమయంతి, పురుషోత్తం, బెహరా కాళి, కోళ్ల లవకుమార్, కామేష్, ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్‌చంద్, మామిడి రాము, దోని కొండలరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కవిటి : కేక్ కట్ చేస్తున్న విప్ అశోక్

రణస్థలం రూరల్ : కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తదితరులు

లావేరు : రక్తదానం చేస్తున్న యువతతో ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాసరావు

సిసి రోడ్డు ప్రారంభిస్తున్న విప్ అశోక్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

కవిటి: మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని శిలగాంలో రూ.22 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ శరవేగంగా సిసి రహదారుల నిర్మాణం పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంద న్నారు. దానిని విధిగా పాటిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు బెందాళం రమేష్, మణిచంద్ర ప్రకాష్, ఆరంగి మధు, పొందల కృష్ణారావు, రంగారౌలో, బార్ల చినబాబు, బెందాళం తిరుమలకుమార్, బీమారౌలో, పుల్లట సంతోష్ పాల్గొన్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కొత్తపేట ప్రాథమికోన్నత పాఠశాలను పదో తరగతి వరకు అప్ గ్రేడ్ చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాసలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 42 ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారని, అనంతరం దీనిని ప్రాథమికోన్నత పాఠశాలగా అప్పటి ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రస్తుతం 168 మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. 9,10 తరగతులు చదువుకోవడానికి 40 మంది విద్యార్థులు ఆరు కిలోమీటర్ల దూరంలోని పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. మత్స్యకార గ్రామం కావడంతో చదువు మధ్యలో ఆపివేయడం సర్వసాధారణం అవుతుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందు పాపారావు, నారాయణ, గణేష్, కొర్లయ్య, దేవదాస్, గణేష్, కారి కొర్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

నాక్ బృందం సభ్యులను కోరిన ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం వందల మంది విద్యార్థులను తీర్చిదిద్ది దేశ విదేశాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో స్థిరపడడానికి తోడ్పాటు అందించిన ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు ఇచ్చి అభివృద్ధి చెందడానికి తోడ్పాటు అందించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ అక్రిడేషన్ కమిటీ (నేక్) బృందం గురువారం పరిశీలించింది. బెంగళూరుకు చెందిన కమిటీ చైర్మన్ సంతోష్ వి.కోటి, సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను, కళాశాల మైదానాన్ని, భవనాలను పరిశీలించారు. ఎంతో ప్రతిష్ట ఉన్న ఆర్ట్స్ కళాశాల అభివృద్ధి చెందాలంటే మరికొన్ని అదనపు భవనాలు కేటాయించాలని, ఆధునిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేతో పాటు పూర్వ విద్యార్థులు కోరారు. నాక్ బృందాన్ని కలిసిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, రిటైర్డ్ జెడ్‌పి సిఇఒ సురంగి మోహనరావు, రిటైర్డ్ సెట్ సిఇఒ వి.వి.ఎన్.మూర్తి, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి తంగి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నాక్ బృందంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే గౌతు శిరీష

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా పవర్ బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సూదికొండ రెల్లివీధి, కాశీబుగ్గ న్యూ కాలనీ, బత్తులవీధి, అన్నపూర్ణ ఆశ్రమం, పూజారి వీధి తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సాధారణ నిధులతో పవర్ బోర్లు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో మున్సిపాలిటీలో నీటి సమస్య ఉందని, చాలా ప్రాంతాల్లో మహిళలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు. తాను అధికారంలోకి వస్తే నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చానని, దానికి కట్టుబడి చాలా ప్రాంతాల్లో పవర్ బోర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీ ప్రాంతానికి ఉద్దానం ప్రాజెక్టు నీటిని సరఫరా చేసేందుకు అధికారులతో చర్చిస్తున్నామని అన్నారు. త్వరలోనే నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, కమిషనర్ ఎన్.రామారావు, డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశ

మందుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న రెండు అపోలో మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఆశ తనిఖీలు గురువారం నిర్వహించారు. ముందుగానే పట్టణంలోని మందుల దుకాణాల తనిఖీలకు ఔషధ నియంత్రణ అధికారులు వస్తున్నారన్న సమాచారం ఆ శాఖ ఎడి చంద్రరావు అనే వ్యక్తి సమాచారం ఇచ్చినట్లు బయటకు వార్తలు వచ్చాయి. దీంతో పట్టణంలోని మందుల దుకాణాలన్నీ మూసివేశారు. పట్టణంలోని అపోలో మందుల దుకాణంపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశ తనిఖీలు పూర్తయిన తర్వాత విలేకరులకు ఎటువంటి వివరాలు అందించకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రజాశక్తి వివరాలు వెల్లడించాలని కోరినప్పటికీ సమాచారం కావాలంటే ఎడితో మాట్లాడుకోండి అంటూ చరవాణి నెంబర్ ఇచ్చి కారులో అక్కడి నుంచి వెళ్లిపోవడం గమనార్హం. పట్టణంలో నిర్వహించిన తనిఖీలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. దుకాణదారుల నుంచి ముడుపులు అందుకోవడానికే ముందస్తు సమాచారం అందించారని పలువురు ఆరోపిస్తున్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

కోటబొమ్మాళి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా 7 శాతం వడ్డీతో రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సిఇఒ మెండ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒర్జినల్ 1బి, బయోమెట్రిక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తీసుకొని పిఎసిఎస్ కార్యాలయానికి వచ్చి రెన్యులవ్ చేసుకోవాలన్నారు. లేకుంటే 13శాతం అపరాధ వడ్డీతో లోన్ మొత్తం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు.

సముదాయాల రద్దు

టెక్కలి : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రతినెలా నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు జనవరి నెలకు రద్దయ్యాయి. చివరి వారంలో నిర్వహిస్తున్న సముదాయాలని మార్పులు చేయనున్న క్రమంలో రద్దు చేసినట్లు సమాచారం. పాఠశాలల సముదా యాలు స్థానంలో క్లస్టర్ విధానం తీసుకురావడం, మండల లోని సౌకర్యాలతో క్లస్టర్‌లు ఏర్పాటు వంటి కార్యక్ర మాలు ఉండడంతో ఈ నెల రద్దు అయినట్లు సమా చారం. కాగా, ఈ నెల 27 నుంచి ఎఫ్ఎ-3 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల విధానంలో మార్పులు చేసుకుంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయి తే మారిన విధానంపై ఆయాన సబ్జెక్టు ఉపాధ్యాయులు చర్చించుకునేందుకు సముదాయాలు అవసరం.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

జలుమూరు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని అల్లాడ, పారిశెట్టి, రెల్లివలస బిటి రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ అమలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు ఓటర్ల దినోత్సవం

నందిగాం : ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డిటి ఆర్.రామారావు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద ముగ్గుల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పట్టాలపై ఉన్న మృతదేహం

మండలంలోని పూండి రైల్వేస్టేషన్‌కి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందారని జిఆర్‌పి ఎస్ఐ ఎస్.కెషరీఫ్ గురువారం తెలిపారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లు మధ్య ఉంటుందన్నారు. నలుపుగళ్ల షర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆత్మహత్య, రైలు నుంచి జారిపడి మృతి చెందాడా అన్న వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. వివరాల కోసం 9440627567 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సోంపేట

అనిల్‌కుమార్ (ఫైల్)

కంచిలి మండలం జలంత్రకోట కూడలి వద్ద సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో బారువకు చెందిన అనిల్ కుమార్ తీవ్రంగా గాయపడిన సంగతి విధితమే. ఈ మేరకు శ్రీకాకుళం మెడికల్‌లో నాలుగు రోజుల పాటు చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించి మృతి చెందారు. లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో హరీష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. అనిల్‌కుమార్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బావిలో మృతదేహం

బూర్జ: మండలంలోని మదనపురం గ్రామ సమీపంలో వున్న మంచి నీళ్లబావిలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. విఆర్ఒ వ్యాపారి లక్ష్మీనారాయణ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి వ్యక్తి నీళ్లబావిలో మృతి చెంది ఉన్నాడని గ్రామస్తులు సమాచారం అందించారని తెలిపారు. ఈ వ్యక్తి గత కొద్ది రోజులుగా మతి స్థిమితం లేకుండా తిరుగుతూ వున్నాడని, నీళ్లు తాగడానికి వచ్చి పడిపోయి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులకు వివరించినట్లు ఆయన తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ప్రవళ్లిక మృతదేహాన్ని వెలికి తీసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడు వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

చికిత్స పొందుతున్న వసంతులు

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఆర్‌టిసి బస్సు ఢీకొని పలాస-కాశీబగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడుకు చెందిన రెల్ల వసంతులు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. గొప్పిలి నుంచి పలాస వస్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఆయన ఎడమకాలు తొడల నుంచి వేరైంది. కుడికాలు, తలకు బలమైన గాయాలయ్యాయి. బైక్ బస్సు కింద ఇరుక్కోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సిఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన యువకులు

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

లావేరు: మండలంలోని సుభద్రాపురం వంతెన డౌన్ తాళ్లవలస గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి శ్రీకాకుళం నుంచి విజయవాడ వెళ్తున్న వెంకటరమణ ట్రావెల్స్ బస్సు ముందు లావేరు, సుభద్రాపురానికి చెందిన దేవరపల్లి వెంకటేష్, ముంత చంద్రమౌళి బుడుమూరు నుంచి రణస్థలం పనిమీద ద్విచక వాహనంపై వెళ్తున్నారు. తాళ్లవలస గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బస్సును ఓవర్‌టెక్ చేసేందుకు వెనుకనుంచి వస్తున్న లారీ ఒక్కసారిగా బస్సుపైకి దూసుకురావడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంతో ఒక్కసారిగా బస్సును రహదారి ఎడమ వైపుకు తిప్పడంతో ద్విచక వాహనాన్ని ఢీకొనడంతో బోల్తా పడి ఇద్దరు యువకులు రహదారిపై తుళ్లిపోవడంతో తలకు, కాళ్లు, చేతులు, శరీర భాగాలకు గాయాలయ్యాయి. దీంతో బస్సులో ప్రయాణికులు ఆందోళనకు గుర్యయ్యారు. అయితే డ్రైవర్ వెంటనే బస్సును నిలుపుదల చేసి తీవ్రంగా గాయపడిన యువకులను అదే బస్సులో హుటాహుటిన రణస్థలంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారిద్దరికి చికిత్స అందజేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పొందూరు: మండలంలోని లోలుగుకాలనీలో బుధవారం రాత్రి పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో ఎస్ఐ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద రూ.10,080 నగదును, ఎనిమిది

ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఫర్నిచర్ షెడ్‌లోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తమరాం ఇసుకరీచ్ నుంచి నారాయణపురం మీదుగా వస్తున్న ఇసుక లారీ అదుపుతప్పి ఫర్నిచర్ షెడ్‌లోకి దూసుకు వెళ్లింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఇసుక రీచ్ నుంచి ఇసుకలోడుతో వస్తున్న లారీ బూర్జ మండలంలోని చీడివలసలో అదుపుతప్పి పక్కనే ఉన్న ఫర్నిచర్ షెడ్‌లోకి దూసుకు వెళ్లింది. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో ప్రాణనష్టం సంభవించలేదు. ముఖ్యంగా ఫర్నిచర్ షెడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి ఢీకొట్టినట్లయితే పెద్ద ప్రమాదమే సంభవించేదని గ్రామస్తులు తెలిపారు. అయితే ఫర్నిచర్ షెడ్ పూర్తిగా ధ్వంసం కావడంతో సుమారు రెండు లక్షలపైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫర్నిచర్ యజమాని పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ షెడ్డుపైనే ఆధారపడి కుటుంబ పోషణ సాగిస్తున్న తనకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని శ్రీరాములుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

బయటకు తీస్తున్న లారీ

రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గంజాయి రవాణాపై విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఆమదాలవలస/ సరుబుజ్జిలి

జోరుగా సాగుతున్న గంజాయి అక్రమ రవాణాపై ఎస్‌ఐలు సనపల బాలరాజు, బి. హైమావతి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గురువారం పట్టణంలో డాగ్ స్క్వాడ్‌తో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల లగేజీ బ్యాగులతో పాటు రైల్వే స్టేషన్ ఆవరణలోని షాపుల్లో పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని కొన్ని ప్రాంతాలతో పాటు సిఎస్‌పి ప్రధాన రహదారిలో ఆర్‌టిసి బస్సులు, వివిధ వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. మండలంలోని గాజుల కొల్లివలస పరిధిలోని ఉన్న సంగమేశ్వర స్వామి కొండ పరిసర ప్రాంతాల్లో అనుమానిత కార్యకలాపాలపై డ్రోన్ సహాయంతో పరిశీలించారు. అలాగే సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో సరుబుజ్జిలి, ఎల్‌ఎన్ పేట మండలాల ప్రధాన కూడళ్లలో ఒడిశా రాష్ట్రం నుంచి విజయవాడ, తెలంగాణ వైపు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ నిలిపి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి గంజాయిపై ఎటువంటి సమాచారం తెలిసిన తక్షణమే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం
చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో సమీపంలో రూ.5 లక్షలు మున్సిపల్ సాధారణ నిధులతో కవర్ శ్లాబ్ నిర్మాణానికి గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోడ్ల కూడలి వద్ద చిన్నపాటి వర్షం కురిసే కాలువలు నుంచి చెత్తా చెదారం రోడ్డుపైకి వస్తుతుందని అన్నారు. పట్టణ ప్రజలు, వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా కవర్ శ్లాబ్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. దీనిద్వారా అటు ప్రజలు, వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా మరోవైపు చెత్తాచెదారం రోడ్డుపైకి రాకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. త్వరగా పనులు పూర్తిచేసి పట్టణ ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'మేము సైతం - స్వచ్ఛంద సేవా సంస్థ' ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సంస్థ అధ్యక్షులు బేకి ఆనార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బన్న నాగేశ్వరరావు,ఉపాధ్యక్షులు యండ నందేశ్వరరావు, సభ్యులు పి.సురేష్, డి.శంకరరావు, కె.ప్రకాష్‌తో పాటు అధిక సంఖ్యలో యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. వాకర్స్ ప్రతినిధులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ ప్రతినిధులు ఇందిరా ప్రసాద్, జోగినాయుడు, తంగుడు నారాయణరావు, గోలీ ఉమామహేశ్వరరావు, సంతోష్, వై.మోహన్, వాసుదేవరావు, జామి రాధాకృష్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మందస : మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సంస్థ ప్రతినిధులు

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న బివికె విద్యార్థులు

కొత్తూరు : మండలంలోని పాతపొన్నుటూరు యుపి పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, పి.చంద్రశేఖర్, బి.సంతోష్‌కుమార్, ఇ.సౌజన్యవతి, బి.నాగేశ్వరరావు, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత, కళ్యాణి ఆంగ్ల, కవిటికొత్తూరులోని బివికె, ఎస్‌విజె, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నేతాజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి, బివికె ప్రిన్సిపాల్ అనిల్ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్షీకాంతం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో సంఘ సేవాకులు

లావేరు : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాసరావు

నౌగాపు నాగరాజు, సుసరాపు సూరిబాబు, సకల భక్తుల త్రినాథ్‌లు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శిరసాల శ్రీనివాస్, జామి చంద్రశేఖర్, సిహెచ్.శ్రీను, సకల భక్తుల శ్రీనివాస్, మూగు మురళి, బోయిన శ్రీనివాస్, కూన భాస్కర్, రఘుపాత్రుని రామారావు, మంచాల వెంకటరమణ, నౌపడ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నేతాజీ చిత్రపటానికి చైర్మన్ డి.కృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా నేత్రాజీ, స్వామి వివేకానంద జీవిత చరిత్రలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో శాంతినికేతన్, రవీంద్ర భారతి, స్వర్ణభారతి స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ కేసి పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, సునీత, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తేజ తేజస్, సెక్రటరీ మోహన్, ప్రియా జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.పి.ఎల్.జ్యోత్స్న పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నేతాజీ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, జనసేన కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్, మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఆవరణలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డొంకాన పాపారావు, స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాస : మండలంలోని బొడ్డపాడు గ్రామ సైనికుల సంఘం ఆధ్వర్యాన నేత్రాజీ చిత్రపటానికి అధ్యక్షులు రాజేశ్వరరావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఐ.ఎం.రావు, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, బొడ్డపాడు యువజన సంఘం ప్రతినిధి బొడ్డు జగన్, ధ్యాన్ చంద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు బైనపల్లి కేశవరావు, గర్తం తులసీరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ (నేతాజీ) జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. నేతాజీ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఆర్.ప్రతాప్‌కు ప్రథమ బహుమతి లభించింది. గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో తెలుగు పండితులు కె.కృష్ణ, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

నౌపడ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

పశుసంపదను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పశుసంపదను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పల్లిసారధిలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ప్రతి పశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఆరోగ్య శిబిరాలు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం మందులు అందజేస్తారని తెలిపారు. అనంతరం పశుసంవర్ధకశాఖ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుశాఖ

బూర్జ : మందులను పంపిణీ చేస్తున్న రామకృష్ణ

సహాయ సంచాలకులు మట్ట రవికృష్ణ, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ సర్పంచ్ పోతనపల్లి షణ్ముఖరావు, మండల పశువైద్యాధికారి మెట్ట పాపారావు పాల్గొన్నారు.

మందస : మండలంలోని నరసింగపురం, కొంకడాపుట్టి సచివాలయాల పరిధిలోని హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్లు దువ్వాడ శ్రీకాంత్, కిల్లా ఉమాభారతిలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసింగపురం సర్పంచ్ గేదెల పద్మనాభం, సిబ్బంది ధర్మేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని సరియాపల్లి, వాండ్రాడ గ్రామాల్లో పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్యలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, ప్రతినిధి కామేశ్వరావు, పశు సంవర్ధక సహాయకులు జి. వెంకటరావు, కె.నరిసింహులు, చల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

బూర్జ: ప్రభుత్వం అమలు చేస్తున్న పశుఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని

వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరీష

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని మదనాపురంలో ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు సకాలంలో వైద్య సేవలు అందక, పాడి రైతులకు అవగాహన లేకపోవడం వలన మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జోత్స్న, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా సరుబుజ్జిలి మండలంలోని ఇసకలపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్ సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, పి. హేమలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ వాల్ లీక్

పలాస : హిరమండలం గొట్టా బ్యారేజీ నుంచి పలాసకు సరఫరా అవుతున్న జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని రేగులపాడు వద్ద పైపులైన్ ఎయిర్ వాల్ లీక్ అయ్యింది. దీంతో పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న నీరు ఒక్కసారిగా పైకి లేచింది. విషయం తెలుసుకున్న అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పైకి లేస్తున్న నీరు

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి విద్యార్థులు

కవిటి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ 8 విభాగాల్లో నిర్వహించిన రంగోత్సవ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు పయనమయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో వారిని అభినందించారు. జనవరి 24న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జానపద నృత్యం, క్విజ్ విభాగాల్లో వీరు పాల్గొంటున్నట్టు ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పి.బి.కె.శర్మలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ టి.మోహనరావు, ఉపాధ్యాయులు జానకిరావు, వెంకటరావు, ప్రకాష్‌రావు, వాసుదేవరావు, అరుణకుమారి, రాధిక, నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

జగన్నాథరావు కృషి చిరస్మరణీయం

శ్రీకాకుళం అర్బన్ : శిష్ట కరణ సామాజికవర్గ ప్రయోజనం కోసం విశ్రాంత పర్యవేక్షక ఇంజినీరు ఇప్పిలి జగన్నాధరావు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని మహలక్ష్మినగర్ కాలనీలో గల శిష్టకరణ సామాజిక భవనంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎస్‌విడి మురళి, జిల్లా శిష్టకరణసంఘం అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు, ఫిజియోథెరపిస్ట్ డా.బి శ్రీనివాస్ పట్నాయక్, ఆర్.వి.ఎస్ శర్మ, సదాశివుని కృష్ణ, ప్రభాకరరావు పాల్గొన్నారు.

మైక్ సెట్లు వితరణ

పలాస : పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాలకు మైక్ సెట్లను ఎమ్మెల్యే గౌతు శిరీష సొంత నిధులతో గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, ధనుంజయ, శ్రీను, ముంజేటి చంద్రశేఖర్, లబ్బ రుద్రయ్య, తమ్మినేని ధనుంజయ్, వంకల కుర్మారావు, జోగ మల్లేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మి

వాతావరణ మార్పులపై అవగాహన

కొత్తూరు : 30 ఏళ్ల కిందట, ఇప్పటికీ వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, వాటికి అనుగుణంగా ముందుకుపోవాలని వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు అన్నారు. స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో గురువారం గిరిజన యువతీ, యువకులకు వాతావరణం మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సకాలంలో వర్షాలు పడకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు, పొగ, మంచు, తుపాను వాటి ప్రభావాలపై వివరించారు. పైనాపిల్, కొండ చీపుర్లు, చిరుధాన్యాలు, అరటి, చింత పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెన్నెల దాస్‌నాయుడు, హరికుమార్, కిరణ్, సునీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, లేబర్ కాలనీ, కాశీబుగ్గ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను గురువారం కమిషనర్ ఎన్.రామారావు పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రి ప్రాంతంలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని, మున్సిపాలిటీలో ఎక్కడ పారిశుధ్యం మెరుగుపర్చడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి హెచ్చరించారు.

కేంద్రీయ విద్యాలయంలో క్విజ్ పోటీలు

బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పిల్లల్లో పోటీతత్వాన్ని పెంచుకునేందుకు పరీక్షల నిర్వహణ తప్పనిసరని, పోటీ పరీక్షల్లో పాల్గొంటేనే పరిపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం పేర్కొన్నారు. గురువారం పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యాలయంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న 100 మంది విద్యార్థులు ఈపోటీలకు హాజరయ్యారు. పోటీలో భాగంగా విద్యార్థులకు ఐదుగురు స్వాతంత్ర సమరయోధులు జీవిత చరిత్ర వీడియోలను చూపించి వాటికి సంబంధించిన ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ కె.తారక రామారావు వ్యవహరించారు.

రాజ్యాధికారమే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బహుజన రాజ్యాధికారమే బిఎస్‌పి లక్ష్యమని పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే రాజారావు పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో బిఎస్‌పి సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంతోనే దళిత బహుజనుల బతులకుల్లో మార్పు వస్తుందన్నారు. ప్రజలు చైతన్య వంతులు కావాలన్నారు. 10 శాతం జనాభా ఉన్న ధనిక వర్గాలు పాలకులుగాను 90 శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల వారు పాలితులుగాను కొనసాగుతున్నారన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

రాజకీయంగా, సామా జికంగా, ఆర్థికంగా, విద్య, ఉపాధి, పరిశ్రమలు, ప్రభుత్వ రంగసంస్థలైన జాతి సంపదను అన్ని వర్గాలకు అందించాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు గనుల కేటాయింపు ఏకైక మార్గమని, తాత్కాలిక ప్యాకేజీ కంటి తుడుపు చర్యన్నారు. ఈ సమావేశంలో గుజ్జల సూర్యనారాయణ, అప్పారావు, గొట్టివాడ మణి పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ ముచ్చు పద్మ గురువారం సందర్శించారు. ఆమెకు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఇఒ వై.భద్రాజీ శేష వస్త్రాలతో పాటు చిత్రపటాన్ని అందజేశారు.

విరాళం అందజేత

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన పాలిశెట్టి గౌరమ్మ రూ.1,01,000 విరాళంగా అందజేశారు. గురువారం ఆలయ సూపరింటిండెంట్ కనకరాజును కలిసి ఆమె చెక్కును అందజేశారు.

దీక్షలో పాల్గొన్న నెలవంక గ్రామస్తులు

ఎన్నాళ్లీ దీక్షలు?

కవిటి: సమస్యల పరిష్కారానికి ఇంకెన్నాళ్లు తాము ఈ దీక్షలు చేయాలని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, తమ బిడ్డల భవిష్యత్‌కు బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న నిరాహార దీక్షలు 392వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం దీక్షలో పాల్గొన్న నెలవంక గ్రామస్తులు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా తమ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని అన్నారు. ఏడాదికిపైగా దీక్షలు చేస్తున్నా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తమ పరిస్థితి ఉందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కృష్ణబిసాయి, హరికృష్ణ బిసాయి, సత్యం బిసాయి పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కవిటి

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ పిలుపుమేరకు సోంపేట సబ్ డివిజన్ మీటర్ రీడర్స్ కేలెండర్ ఆవిష్కరణ సోంపేట, రాజపురం సబ్ స్టేషన్లలో గురువారం నిర్వహించారు. సోంపేట ఎడిఇ రవికుమార్, ఎఇ రామారావు, ఇఆర్ఒ రామ్మోహన్, మధుసూదన్ తదితరులు కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మీటర్ రీడర్లు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎపి విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దూగాన భాస్కర్, గొనప ఆనంద్ కుమార్, కంచిలి మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ పండా, పూడి సంతోష్ కుమార్, వలసయ్య, దుర్యోధన, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన పంట

ప్రజాశక్తి - కవిటి

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మేలైన దిగుబడులు వస్తాయని ఎఒ బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బొరివంకలో రబీ పంటలను గురువారం పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. ప్రస్తుత సీజన్‌లో వరి పంట ఎకరానికి 75 కిలోలు యూరియా, 50 కిలోల డిఎపి, 25 కిలోల పోటాస్ వాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా చివరి దమ్ములో యూరియా 25 కిలోలు, డిఎపి 50 కిలోలు, పోటాస్ 10 కిలోలు వేసుకోవాలని అన్నారు. అలాగే పిలక దశలో 25 కిలోలు, చిరుపొట్ట దశలో 25 కిలోలు యూరియా, 15 కిలోల పొటాషియం వేసుకోవాలని అన్నారు. ఎరువుల యాజమాన్యం పాటించడం వల్ల వరి పంటకు కావలసిన పోషకాలు పుష్కలంగా అంది మంచి పంట వస్తుందన్నారు. వరిలో కలుపు యాజమాన్యం కోసం పంట ఉడిచిన రెండు నుంచి ఐదు రోజుల్లోపు ప్రతీల్లాపూర్ 0.5 లీటర్లు, బ్యూటాక్లోర్ 1.25 లీటర్లు, అక్షదయార్జిల్లు 35 గ్రాములు 20 లీటర్ల నీటిలో కలిపి నీరు తక్కువగా ఉన్నప్పుడు పొలంలో చల్లుకోవాలి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు పవన్ కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ దుర్గాప్రసాద్

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కవిటి

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకుంది యువశక్తి ఫౌండేషన్. మండలంలోని బి.గొనపపుట్టుగకు చెందిన బడగల చిన్నారావు అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం అవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు.. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువశక్తి ఫౌండేషన్ సభ్యులు గురువారం చిన్నారావు కుమారుడికి రూ.11వేలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు చిన్నారావుకి అండగా నిలవాలని కోరారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కొఠారికి చెందిన పేద మహిళకు పూర్ణాటకం గ్రామ సంఘం సభ్యులు నగదు, బియ్యం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సహదేవ్‌రెడ్డి, యు.దేవరాజు, రుక్మాంధరావు, జగ్గారావు, ఎం.పాపారావు, ఎస్.కృష్ణ, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎఅండ్ ఎంసిఎ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగాధిపతులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేష్ తంగుడు, డాక్టర్ పి.రమేష్‌యుడు, సిఎస్‌టి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్న ఎస్.కల్యాణ్, పేడాడ ప్రియాంకలు 'యసెన్సియల్ ఆఫ్ పైతాన్ ప్రొగ్రామింగ్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు గురువారం తన ఛాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు.. బిటెక్ కంప్యూటర్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం వల్ల ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన

పలాస : కడప జిల్లాలో ఇటీవల నిర్వహించిన మహాశోభ యాత్రలో శ్రీకాకుళం జానపద గుండెచప్పుడు తప్పెటగుళ్లు కళారూపంతో వెళ్లిన కళాకారులు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. మెళియాపుట్టి మండలం చీపురుపల్లికి చెందిన పాలిన శంకర్ బృందం చేసిన తప్పెటగుళ్ల ప్రదర్శన కడప జిల్లా ప్రజలను విశేషంగా ఆకర్షించింది. అద్భుతమైన లయ విన్యాసాలతో పల్లె జానపదాలతో రాముని చరిత్రను పాడుతూ అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో కళాకారులు పాలిన శంకర్, ముడిమించి రమేష్, హరికృష్ణ, దొరబాబు, బన్ని, చరణ్ పాల్గొన్నారు.

తప్పెటగుళ్లను ప్రదర్శిస్తున్న కళాకారులు

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిబాబునాయుడు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని బారువ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఐ హరిబాబునాయుడు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భద్రత కార్యకలాపాలపై వివరించారు. చట్టాల గురించి తెలుసుకొని మెలగాలని సూచించారు. మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలు జోలికి పోకూడదని, విద్యార్థుల దశ ఎంతో కీలకమైనదని తెలియజేశారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

పలాస : జిల్లాల్లో 1.83 లక్షల ఎకరాల్లో జీడిపంట పండిస్తున్నా... పలాస జీడిపప్పుకు గుర్తింపు పొందిందని సిపిఐ ఎమ్‌ఎల్ లిబరేషన్, కిసాన్ మహాసభ జిల్లా నాయకులు మద్దిల రామారావు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ జీడి వ్యాపారస్తులు, దళారులు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న జీడిపప్పు ద్వారా స్వదేశీ జీడి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి గింజలు దిగుమతులపై సుంకాన్ని విధించాలని, 80 కేజీల బస్తాకు కనీస మద్దతు ధర రూ.16 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద బ్యాంకు రుణాలు అందజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా జీడీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాపారస్తులు రైతులతో పాటు శ్రామికుల శ్రమనూ దోచుకుంటున్నారని అన్నారు. జీడి పప్పు కాల్చికొట్టి ప్రాసెస్ చేసే పనిలో కార్మికులకు ఎక్కువ ఉపాధి దొరికేదని, కార్మికులతో పనిలేకుండా అన్ని పనులు యంత్రమే చేయడంతో కార్మికులకు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణదాస్ పరామర్శ

పోలాకి: మండలంలో ఇటీవల ప్రమాదాలకు గురైన వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ గురువారం పరామర్శించారు. పోలాకి సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ కాలుకు దెబ్బ తగిలిందని తెలుసుకొని ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డోలకు చెందిన ఎన్ని వెంకట రమణ బైక్ ప్రమాదంలో గాయపడ్డాడు. అతనినీ పరామర్శించారు. కొత్తరేవులో అనారోగ్యంతో బాధపడుతున్న రామలక్ష్మిని పరామర్శించారు. డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లెపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న కృష్ణదాస్